క్లుప్తంగా

ప్రసన్నరంగనాథ స్వామి కల్యాణం రేపు

రాజంపేట టౌన్ : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి తిరుప్పావై భక్తసేవా సమితి ఆధ్వర్యంలో గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తిరుప్పావై భక్తసేవా సమితి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 7 గంటలకు షోడసోపచార పూజలతో గోపూజ, 8 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, తిరుప్పావై పారాయణం, 9 గంటలకు కోలాటం, 9:30 గంటలకు ఎదుర్కోలు మహోత్సవంతోపాటు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు, గిన్నిస్ రికార్డు గ్రహీత వెంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాసచే అన్నమాచార్య సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

విధులకు సకాలంలో హాజరుకావాలి

సిద్దవటం : మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్ సింగ్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి సచివాలయ ఉద్యోగి యూనిఫాం ధరించి, సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. సేవలను పెంచి, రికార్డులను మెయింటెనెన్స్ చేయాలన్నారు. ప్రతి రోజు మూడు గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ సూచించారు.

రామాలయ గోపుర నిర్మాణానికి విరాళం

గాలివీడు : రామాలయం గోపుర నిర్మాణానికి రూ. 50,116లు ఎన్ఆర్ఐ చెంచు వేణుగోపాల్ రెడ్డి విరాళంగా అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. మండల కేంద్రం గేటువద్ద గల శ్రీ కోదండరామాలయం మూడంతస్తుల రాజగోపుర నిర్మాణానికి తనవంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.


8న ఉచిత మెగా వైద్య శిబిరం

పెనగలూరు : ఈనెల 8వ తేదీన పెనగలూరులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీహరి మెడికల్ షాప్ ఓనర్ శ్రీహరి తెలిపారు. తిరుపతికి చెందిన రేడియంట్ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి, శ్రీహరి మెడికల్ షాపువారి ఆధ్వర్యంలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుందన్నారు. శిబిరంలో డాక్టర్ రెడ్డి వరప్రసాద్ బాబు ఊపిరితిత్తులు, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా అందజేస్తారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు (బ్లడ్ గ్రూప్ టెస్టులు) నిర్వహించారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ వారు సంయుక్తంగా ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలత పంకజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ తెలుసుకొని ఉంటే ప్రమాద సమయంలో ఎవరికైనా అత్యవసర సమయంలో రక్తం అవసరముంటే రక్తదానం ఇవ్వచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరావు, రెడ్ క్రాస్ సంస్థ డీఎఫ్ఓ సుధాకర్, అధ్యాపకులు శివమ్మ, ఫరూక్, అఫ్సాన, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



ధృవపత్రాలతో శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌పై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసినట్లు ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. 2023 నుంచి సీబీఎస్ఈ విధానం అమలులోకి రానుండటంతో పీజీటీ కెమిస్ట్రీ ఉపాధ్యాయులకు ఈ శిక్షణను అందించారన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె పంచాయతీ అభివృద్ధికి పనులు చేపడుతున్నామని వైఎస్సార్ పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంజీవపురం గ్రామంలో పక్కా రోడ్డు పనులను సాయివికాస్‌రెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమలను నిర్వహించామన్నారు. పంచాయతీలో అవసరం ఉన్న ప్రతి చోట పక్కా రోడ్డు పనులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో శింగమల రఘునాథ్ రెడ్డి, శింగమల మల్లికార్జునరెడ్డి, శింగమల విశ్వనాథ్‌రెడ్డి, శింగమల కరుణాకర్ రెడ్డి, చింతా శివారెడ్డి, పట్నం రఘురామిరెడ్డి, చింతా రామ్మకృష్ణారెడ్డి, షేక్ మహబూబ్ బాషా, సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పునరావాసం కల్పిస్తాం

- మంగంపేట ముంపు గ్రామాల ఆర్ అండ్ ఆర్ లేఅవుట్ పరిశీలన
- గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతం చేస్తామన్న ప్రభుత్వ విప్ కొరముట్ల



ఓబులవారిపల్లె: లే అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ, అగ్రహారం గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం మెరుగైన పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ముక్కావారిపల్లె పంచాయతీలోని పునరావాసం కోసం ఏర్పాటు చేసిన లేఅవుట్ భూములను కొరముట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. పునరావాసం కల్పించేందుకు దాదాపు తొంబై ఎకరాలలో భూములను సిద్ధం చేశామని తెలిపారు. గ్రామాల ప్రజలందరికీ సమన్యాయంతో లేఅవుట్ నిర్మాణం చేపట్టామన్నారు. పునరావాసంతోపాటు పాఠశాల, కళాశాల, గ్రౌండ్, వైద్యశాల, విశాలమైన రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మినుగు సుధాకర్, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సీపీఓ వెంకటరమణ, బెనర్జీ, మాజీ సర్పంచ్ శంకరయ్య, వైఎస్సార్‌పార్టీ నాయకులు పి.రామసుబ్బారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి సీసీరోడ్లు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా చేస్తున్నామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని సచివాలయం 3 పరిధిలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డను ఆయన ప్రాంభించారు. అనంతరం మాట్లాడుతూ కోడూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీస్, ఎంపీ నిధులతో సమస్యలను బట్టి ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని వీధులకు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటుకు ప్రణాళిక చేశామని తెలిపారు.

అన్ని సౌకర్యాలతో జగనన్న కాలనీలు

నియోజకవర్గంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అధునాతనంగా ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. స్థానిక రెడ్డివారిపల్లిలో నిర్మించిన జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలు, అభివృద్ధి, మౌలిక సౌకర్యాల పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో రెడ్డివారిపల్లిలో నేటి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. మైదానంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అన్ని మండలాలనుండి వచ్చేవారికి ఏర్పాట్లు చేయాలని నాయకులకు తెలిపారు.

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకునిగా పోలా



ఎమ్మెల్యే రాచమల్లును కలిసిన మునిసిపల్ చైర్మన్ పోలా, చౌప్పా ఎల్లారెడ్డి

రాజంపేట టౌన్ : ప్రొద్దుటూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకునిగా రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ విషయాన్ని పోలా శుక్రవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పజెప్పిందని, ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. అక్కడి నాయకులు, కార్యకర్తలతో మమేకమై వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ఘనవిజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లుని మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఆయన వెంట మైదుకూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చౌప్పా ఎల్లారెడ్డి ఉన్నారు. పోలా నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం : సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని సిద్దవటం మండలంలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు సిద్దవటంలోని 8వ వార్డుకు (ఓసీ, చెవిటి), ఆయా పోస్టులకు సంబంధించి కొమ్మనియినిపల్లె (ఓసీ చెవిటి), బంగారుపేట (ఎవరైనా మైనర్ దివ్యాంగులు), భాకరాపేట (ఈడబ్ల్యూఎస్)కు కేటాయించామన్నారు. ఒంటిమిట్ట మండలం పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌ల పోస్టులు మల్లేశ్వరపురం (ఎస్టీ), గుంటికాడపల్లె (ఓసీ), ఆయా పోస్టులు మలకాటిపల్లె(ఎస్టీ), చెర్లోపల్లె బీసీ కాలనీలో(ఓసీ), అట్లూరు మండల పరిధిలో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు వరికుంట (బీసీ–సీ), గోపవరం మండలం పరిధిలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు నీరాబాదుల్యాపల్లె(బీసీ–సీ), ఆయా పోస్టులకు లెక్కవారిపల్లె(ఎస్టీ), యల్లారెడ్డి పల్లె (ఓసీ– వీహెచ్), సుమిత్రానగర్–2 16వ వార్డు (ఎస్టీ), మహబూబ్‌నగర్–1, 13వ వార్డు (ఎస్టీ), రిజర్వేషన్‌లను కేటాయించామన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు 1 జూలై 2023 నాటికి 21 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండటంతో పాటు, స్థానిక వివాహిత మహిళ అయ్యి ఉండాలన్నారు. వర్కర్ పోస్ట్‌కు పది, ఆయా పోస్ట్‌కు 7వతరగతి చదివి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 11వ తేదీలోపు సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయంలో అందజేసి రసీద్‌ను పొందాలని సీడీపీఓ పేర్కొన్నారు.

హక్కులకు భంగం కలిగించే జీఓను రద్దు చేయండి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న జీఓ నం.1ని వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ నేతలు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సాంబశివ, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుదీర్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం జీఓ రద్దు డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కడానికే పాలకులు ఇలాంటి జీఓలు తీసుకువచ్చారంటూ వారు మండిపడ్డారు. జీఓను రద్దుచేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటరమణ, పట్టణ కార్యదర్శి పుల్లయ్య, నేతలు తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'లకు జీతాలు చెల్లించాలి

జిల్లాలోని ఆశ కార్యకర్తలకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్‌చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సకాలంలో జీతాలు అందకపోతుండడంతో ఆశల ఇళ్ళు గడవడం కష్టమైందన్నారు. విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే అధికారులు జీతాలు చెల్లింపు విషయంలో అదేలా ఉండాలన్నారు. వచ్చే ఆదివారం లోపు ఆశలకు బ్యాంకు ఖాతాల్లో జీతాలు వేయాలని కోరారు. లేకుంటే కార్యాలయాలను ముట్టడి చేస్తామన్నారు.

రబీ పంటసాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆర్బీకేలో రబీ సాగుపై వ్యవసాయాధికారులు శశికళ రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా వేరుశనగ, వరి పంటలను రైతులు సాగు చేశారన్నారు. సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ–క్రాప్ చేయించుకోవాలన్నారు. వేరుశనగ నాటిన 40–45 రోజుల్లో యాజమాన్య పద్ధతులు పాటించి ఎకరానికి 200 కేజీల జిప్సం వాడాలన్నారు. వేరుశనగలో ఎరపంటలు, అంతర్ పంటలు వేయడం వలన చీడపీడల నివారణతో పాటు ప్రధాన పంటలో దిగుబడి ఆశించిన మేర వస్తుందన్నారు. వరినాట్లు వేసేటపుడు వేరుశుద్ధి చేయాలన్నారు. వరి నాటేటప్పుడు కొనలు తుంచి నాటాలన్నారు. వరిలో కాలిబాటలు వేయాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈ నెల 13లోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు.

వీరభద్రుడికి పౌర్ణమి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రాహుకాల పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్రునికి పౌర్ణమి కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి పుంగనూరుకు చెందిన భక్తులు, బెంగుళూరుకు చెందిన భక్తులు సంయుక్తంగా నిర్వహించారు. కల్యాణం పూర్తయిన తరువాత కల్యాణ దాతలను ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు అమ్మవారికి రాహుకాల పూజలు చేశారు. మహిళలు ఈ పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ విజయ, ఈఓ రమణ రెడ్డి, నాగభూషణం, కృష్ణయ్య స్వామి, రాచరాయ యోగిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయ ఆలయంలో స్తోత్ర పారాయణం

ఒంటిమిట్ట (సిద్దవటం) : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయ ఆలయంలో శుక్రవారం రెండవ రోజు అన్నవరం క్షేత్రానికి చెందిన శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం బృందం ఆధ్వర్యంలో శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామరక్ష బృందం వారు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని, ప్రపంచంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం చేస్తున్నామన్నారు.

నల్ల గంగమ్మ ఆలయంలో శ్రమదానం

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయ సమీపంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ సహకారంతో తుది విడత మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ పాత్తూరి రవీంద్రనాయుడు, వైఎస్ఆర్ సీపీ నాయకుడు వివి ప్రతాప్‌రెడ్డిలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహిద్దాం

రాజంపేట రూరల్ : దేశాభివృద్ధి కోసం యువతను ప్రోత్సహిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకుడు శరత్‌కుమార్‌రాజు కోరారు. మండల పరిధిలోని మదనగోపాలపురంలో శుక్రవారం ఎంజీపురం యువత ఆధ్వర్యంలో ఎంపీఎల్(మదన గోపాలపురం ప్రీమియర్ లీగ్) ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శరత్‌కుమార్‌రాజు స్థానిక ఎంపీటీసీ మధుబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండూరు విశ్వనాథ్‌రాజుతో కలిసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి 17వ తేదీ వరకు ఈ మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని 34టీంలు పాల్గొంటున్నట్లు తెలియజేశారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలియజేశారు.

'భూకబ్జాలను అరికట్టాలి'



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : జిల్లాలో జరుగుతున్న భూకబ్జాలను పాలకులు వెంటనే అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూకబ్జాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములను వెంటనే పేదలకు పంచాలన్నారు. లేనిపక్షంలో తాము ఆ భూములను పాతి పేదలకు పంచి పెడతామంటూ హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాల విభజన తరువాత భూకబ్జాలు ఎక్కువైపోయాయన్నారు. జిల్లాలో భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపించేందుకు జిల్లా జడ్జి పర్యక్షణలో జేసీ, ఎస్పీల ఆధ్వర్యంలో విచారణ జరిపించి భూములను కాపాడాలని కోరారు. కబ్జాలపై అధికారులు స్పందించని పక్షంలో జనవరి 30న కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా సీపీఎం నేత పి.మణి, జిల్లా కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ డి.సి.వెంకటయ్య తదితరులున్నారు.

వైరు చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

లక్కిరెడ్డిపల్లి : సెల్ టవర్ బ్యాటరీ కేబుల్ వైరు చోరీ కేసులో దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దుర్గా ప్రసాద్ జియోసెల్ టవర్ కంపెనీలో పని చేస్తూ ఎయిర్‌టెల్ కేబుల్ వైరు రాజంపేట, కడప, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాలలో చోరీ చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న బ్యాటరీ టవర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతన్ని కోర్టుకు అప్పజెప్పినట్లు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, గోపినాయక్, బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫీగా ఉపాధి పథకంపై ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరంలో రికార్డును పరిశీలిస్తున్న ఉపాధి హామీ పీడీ యదుభూషన్ రెడ్డి తదితరులు

వీరబల్లి : వీరబల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఓపెన్ ఫోరం సాఫీగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో సభ నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో 2020–2022 సంవత్సరాలకు గాను సుమారు రూ. 22 కోట్లతో పనులు జరుగగా ఈ పనులకు సంబంధించి గత వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామీణ స్థాయిలో నుంచి జాబ్ కార్డులు ఉన్న కూలీల వద్దకు వెళ్ళి విచారించి వారి వద్ద నుంచి సమగ్ర సమాచారం సేకరించారు. ఈ సేకరించిన సమాచారాన్ని ఓపెన్ ఫోరంలో జిల్లా అధికారుల ఎదుట డీఆర్‌ఓలు చదివి వినిపించారు. గ్రామ పంచాయతీలవారీగా తీసుకొచ్చిన సమాచారాన్ని కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేపట్టాల్సిన పనుల వివరాలను, వారు చేసిన పనుల వివరాలను అధికారుల ఎదుట తెలియజేశారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని ఇందుకు సంబంధించి కేవలం రూ. 33 వేలు మాత్రమే రికవరీ వచ్చిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో సిబ్బంది చక్కగా కూలీలకు పనులు కలిపించడమే కాకుండా నాణ్యత చూపిస్తూ సకాలంలో కూలీలకు డబ్బులు చెల్లించి ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా తోడ్పడినందుకు ఉపాధి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, డీవీఓ ప్రకాష్, క్వాలిటీ కంట్రోల్ సుశీల, ఏపీడీలు రవికుమార్, రెడ్డప్పలు, ఎస్ఆర్‌పీ సూర్యచక్ర, ఏపీఓ నాగరాజు, ఎస్‌టీఎం గౌరి శంకర్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

అడిషనల్ డీఎంహెచ్ఓ డా. ఖాదర్ వలీ



అబెట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న సిబ్బంది

సిద్దవటం : దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి జ్వరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని భాకరాపేట గ్రామాన్ని సందర్శించి, ఫ్రైడే డ్రైడేలో భాగంగా వైద్య సిబ్బందితో ఇంటింటా సర్వే చేసి చాలా కాలంగా నీరు నిల్వ ఉన్న తొట్లలో కొబ్బరిబోండాల్లో ఉన్న నీరును తొలగించి అబేట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డితో శానిటేషన్ పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షయ అధికారి డాక్టర్ గోపాలక్రిష్ణ, మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మపర్సన్ రాజేశ్వరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ నాగవల్లి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండండి

డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి



రికవరీ చేసిన నగలను చూపిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ నరసింహారావు

రాజంపేట : ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో మంగళిమిట్టలో నివాసం ఉంటున్న ఇందిరమ్మ ఇంటిలో గత ఏడాది శివరాత్రి రోజు జరిగిన చోరీకి సంబంధించిన రికవరీని డీఎస్పీ సమక్షంలో చూపించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడాతూ సెలవుల్లో ఊర్లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చోరీ విషయానికి వస్తే చిత్తూరు జిల్లా కార్వేటి నగరానికి చెందిన సుబ్రమణ్యం (పాతనేరస్తుడు), అతని స్నేహితుడు తిరుపతికి చెందిన ప్రకాశ్‌లు గత యేడాది శివరాత్రి రోజున హత్యరాలకు వచ్చారన్నారు. ఆ సందర్భంగా తిరిగి వెళుతూ 2వతేదీన మంగళమిట్టలో ఇందిరమ్మ ఇంటిలో ఎనిమిదిన్నర తులం బంగారం చోరీకి పాల్పడ్డారన్నారు. వీటి విలువ రూ.3లక్షల ఉంటుందన్నారు. సమావేశంలో పట్టణ సీఐ నరసింహారావు, ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలు తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



రాయచోటి టౌన్‌: రోగులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

సంబేపల్లె : సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు సీఐ ఈదర్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ, నిధుల వినియోగంపై వైద్యాధికారిని అడిగారు. నాడు–నేడు పనులపై ఆరా తీశారు. వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది జనార్ధన్, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం రాయచోటి ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా శుక్రవారం ఆస్పత్రి సాయంకాలం చివరి సమయంలో విజిలెన్స్ ఎఫోర్స్‌మెంట్ సీఐ ఈదర్‌బాషా, మైన్స్ అధికారి ఏజీ శ్రీనివాసులు వారి సిబ్బందితో కలసి ఆస్పత్రిలోని పలు రికార్డులు పరిశీలించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయనే విషయాలపై ఆరా తీశారు. అలాగే రోగులకు సకాలంలో వైద్యం అందుతుందా లేదాని రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. వీరితోపాటు డీఈ లోకేశ్వరరెడ్డి, బాలగంగాధర్ రెడ్డి, శ్రీనివాసులు, జనార్ధన్, కృష్ణానాయక్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



పింఛన్‌ను అందజేస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలో శుక్రవారం కొత్త పింఛన్ల పంపిణీ ముమ్మరంగా చేపట్టారు. నందలూరు, ఆడపూరు, పాటూరు సచివాలయాల్లో పరిధిలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై పింఛన్లను అందజేసి, మాట్లాడారు. మాట తప్పని సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. అవ్వాతాతల కష్టాలను చూసి వారికి మంచి చేయాలనే గొప్ప సంకల్పం ఉన్న వ్యక్తి మన సీఎం అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్య, సర్పంచులు సూర్యనారాయణ, భారతీభాస్కర్‌రెడ్డి, మోడపోతుల సుభాషిణి, ఎంపీటీసీ సుభాన్, గాలా సుధాకర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం నడివీధి సుధాకర్, నాగసుబ్బయ్య, పాటూరు శ్రీను పాల్గొన్నారు.

తిరుపతిలో చికిత్స పొందుతున్న మహిళకు..

పింఛన్ అందజేసిన సచివాలయ కన్వీనర్ రామ్మోహన్, బ్రహ్మేశ్వర్లు



పింఛన్ అందిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పెనగలూరు : మండలంలోని సిద్దవరం గ్రామానికి చెందిన పాటూరి సుబ్బలక్ష్మమ్మ అనే మహిళ తిరుపతిలో అనారోగ్యంతో వైద్య చికిత్సలు పొందుతుంది. ఆమెకు పింఛన్ అందించేందుకు సిద్దవరం సచివాలయ కన్వీనర్ రాఘవరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సిద్దవరం సచివాలయ సాంఘిక సంక్షేమ సహాయకులు బ్రహ్మేశ్వర్లు తిరుపతికి వెళ్ళి సుబ్బలక్ష్మమ్మకు రూ. 2750లు పింఛన్ డబ్బులు అందజేశారు. చికిత్స పొందుతున్న తమకు నేరుగా తిరుపతికి వచ్చి పింఛన్ అందించడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



రైల్వేకోడూరు అర్బన్‌: దర్శనమిస్తున్న అమ్మవారు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణ పరిధిలోని కొత్తకోడూరులో వెలసిన గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. పలు చోట్ల అమ్మవారి ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు రాహుకాల దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జాతీయ రహదారి క్రాస్ రోడ్డు వద్ద వెలసిన సత్యమ్మతల్లికి శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే అమ్మవారిని పూజలు నిర్వహించి, సుందరంగా అలంకరించారు. భక్తులు కాయా కర్పూరం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.